# దేవుడు

**వా**రంతా గుంపులుగా కదులుతున్నారు. గూడెం దాటి మామిడిపల్లి నుంచి టౌన్‌లోకి అడుగువేస్తున్నారు. వర్షపు చినుకులు టప్‌టప్‌మని లయబద్ధంగా పడుతూ ప్రశాంతతని చెడగొడుతున్నాయి. నీలం, ఎరుపు సిరాలో ముంచినట్టుగా వుంది ఆకాశం. క్షణ క్షణానికి మెరుపులతో ఉరుముతోంది.

ముందు నడుస్తున్న నందయ్య గిరుక్కున వెనక్కి తిరిగేడు. తడవకుండా వుండడానికి, తువాలు నెత్తికి చుట్టుకొని నడుస్తున్న గుంపును ఓసారి పరీక్షిస్తూ.

"ఏందిర ఇంత పెండ్లి నడక నడుత్తర్రు మబ్బుల లేచిన గూడ మనం పోయేటట్లు లేదేమురా, నడువుండ్లహే. జల్ది.. జల్ది నడువుండ్లి, లేకుంటే యాడబోతము.." అన్నాడు.

నందయ్య అతుకులేసిన తెల్లచొక్కా వేసుకున్నాడు, తొడుక్కున్న ఖాకీ నిక్కరు గంజితో బిరుసుగా వుంది. జులపాలుగా వున్న జుట్టుకు కొబ్బరినూనె దట్టంగా పట్టించేడు, మొహం జిడ్డు కారుతోంది. చంకలో మూట వేళ్ళాడుతోంది.

నందయ్య మాటలకు నడుస్తున్న గుంపు వేగం పెంచి గబగబా అడుగులు వేయసాగేరు. వర్షంతో నేల తడిసివుండడంచేత అడుగులు కష్టంగా పడుతున్నాయి. నందయ్య పక్కగా నడుస్తున్న లచ్చయ్య "ఒరే రాములోరిని ఎన్నడైనా చూసినావురా"

అన్నాడు. ఆ హెూరుగాలిలో ఆ మాటలు నందయ్యకు వినిపించలేదు. చుట్ట తీసి వెలిగించి గుప్పు గుప్పు మంటూ రైలింజనులా పొగవదులుతుంటే "ఏందిరా నీకింత పరాకాయె, రాములోరిని చూసినావా, అంటే పలకవాయె" అన్నాడు లచ్చయ్య కోపంగా.

"ఓపాలి దూరం నించెలి చూసి ఊరికొచ్చినాను, మా అవ్వశానా బయపడి, పోవద్దుబిడ్డా ఆళ్ళు మనల నంపుతరు, మన కులపోల్లు రాములోరి దగ్గరకు పోవద్దు, పోతే లొల్లి అవుద్ది, మనకు పోశమ్మ, ఉప్పలమ్మ ఉన్నదిరో అందిరా మా అవ్వ" ఆ దినం తన గోడు వెళ్ళబోసుకున్నాడు నందయ్య.

"ఏమో, ఇయాల ఏమైతదో," కుంటుతూ వస్తున్న ముసలోడు పెదవి విరిచేడు. "ఇంకా మీ జమానా కాదులే, మన సర్కారు అందర్నీ ఒకే తీరుగా సూత్తాంది" అవేశంగా అన్నాడు లచ్చయ్య.

* * * * *

దూరంగా స్పీకర్‌లో వినవస్తున్న పాటలకు నందయ్యలో సంతోషం ఎక్కువయింది. "రాములోరికి ఏమేం తెత్తన్నావురా," అన్నాడు లచ్చయ్యవంక తిరిగి హుషారుగా ఆ మాటలకు తన చంకలో వేళ్ళాడే మూట చూపిస్తూ "కేలపండ్లు, ఊదిబత్తీలు, కొబ్బరికాయలు తెత్తన్నా, ఇవి కొనుక్కొస్తనికి మస్తు పైసలయినయ్. బావి దవ్వపోయిన పైసలతోని ఇవ్వన్నీ కొనుక్కొత్తనరా. మల్లబోయినంక మా పటికే లేదురా. ఏం దేవుడోగాని, దేవునికిన్నిత్తనాంగాని మన కట్టాలు ఎపుడు బాపుతడో?" అన్నాడు నిర్లిప్తంగా.

గుడి దగ్గరకంటూ వచ్చేసారు. గుడికెదురుగా సర్విబాదులతో పందిరి వేసుంది. గుడికి డిస్టెంబరు రంగు వేయబడి వుంది. చాలా పురాతనమైన గుడి అది. కొన్ని సంవత్సరాలుగా ఎవరి ఆలనా పాలనా లేక అనాథలా మిగిలివున్న ఆ గుడి పరిస్థితి చూసి ఆ వూరి కొందరు పెద్దలు చందాలు పోగుచేసి బాగుచేయించారు. శ్రీరామనవమి

పండగను పురస్కరించుకొని ఉత్సవాలు జరుపుతున్నారు. ఏం బాగో ఏమిటో అని ఆ గుడిని చూసి విమర్శించిన వారు లేకపోలేదు. కారణం అది కూలిపోవడానికి సిద్దంగా వున్నట్లే కనిపిస్తుంది. పెచ్చులూడిపోయిన గోడలతో శిధిలాలయంలా వుంది.

నందయ్య గబగబ అడుగులేస్తూ గుడి పక్కనే వున్న గిలకబావి దగ్గరకు వెళ్ళి కాళ్ళూ, చేతులూ కడుక్కొని ముఖ ద్వారం వద్ద వచ్చి ఆగి తన వెనక వచ్చిన మిగిలిన పాతిక మందిని ఉద్దేశించి –

"జల్ది జల్ది కాల్లు గడుక్కోని. గుళ్ళేకు పోతాము. ఒకల్లెనకఒకలు 'రాండి' అన్నాడు. గబగబా వస్తున్న నందయ్యను, అతడిని అనుసరిస్తున్న పాతిక మందిని చూసి ఒక వ్యక్తి ఉగ్రరూపంతో చేతిలో వున్న బాణా కర్రను అడ్డుపెట్టాడు. అతను పొడుగ్గా, బలంగా వున్నాడు. మీసాలు వంపు జరిగివున్నాయి. బనీను వేసుకుని పంచె కట్టుకున్నాడు. మెడలో తాయెత్తు, మొరటు చూపులు కళ్ళు క్రూరంగా తిప్పుతున్నాడు.

వారంతా అతన్ని చూసి ఆగిపోయారు. నందయ్య ఏదో చెపుదామని ప్రయత్నించేసరికి బాణాకర్ర అడ్డుపెట్టిన అతని వెనుకగా ఇంకో అతనొచ్చి నుంచున్నాడు. అతను పొట్టిగా వున్నాడు, మొహం గుండ్రంగా వుంది. నెత్తిమీద వున్న కొద్ది జుట్టు ముడివేసి వుంది బాగా పెరిగిన పొట్ట నుదుటి మీద నామాలు, పొట్టమీద విభూది రేఖలు.

వాళ్ళందరనినీ చూసి అతనుకోపంగా.

"ఎవ్రల్రా మీరు మాల మాదిగలం.. దిగుర్రా వెనుకకు దిగర్రా, మీకెన్ని గుండెల్రా.... అన్నాడు ఆ మాటలకు నందయ్య రెండడుగులు వెనక్కి వేసి "ఏంది బాంచెన్ గట్లంటన్లు, మేము రాములోర్నిచూసెతందుకు వచ్చినం జరజూడనీ" అన్నాడు నందయ్య బాణాకర్ర వ్యక్తి నందయ్యను కర్రతో పక్కకునెట్టి "అరెరే ఎక్కకుండ్రి ముట్టుడైపోతది ఎవరైన వూరి వారు జూస్తే నన్ను తిడుతరు ఎందుకురానిచ్చినావని?"

అన్నాడు. ఆ మాటలకు హతాశుడై లచ్చయ్య నామాలు వేసుకున్న పూజారివంక తిరిగి అయ్యవార్లూ మేము శానా దూరం నుంచేలి వచ్చినం మల్ల ఎట్లొత్తం దొర. జరమొక్కనియ్యండి" అన్నాడు ప్రాధేయపడుతూ.

"ఏందిరా సచ్చినయిదిని ఊరిబైట బడుండె టోళ్ళు మీకు రాములోరు కావల్నరా? ఊరి బయట ఉప్పలమ్మ, పోశమ్మ వున్నదిరా నడువుండ్లి ఇక్కణ్ణుంచెలి మీరిండ్లకొస్తే మన కర్ణమయ్య నన్ను తిడతడు. అసలు మీకెవడు చెప్పిన్రా, ఇక్కడకు రమ్మని, చల్, ఎల్లిపొన్రి మల్లగిన కానొస్తే బొక్కలు ఇరగ్గొడత" అన్నాడు పూజారి కోపంగా, అతను అలా తనతిట్ల ప్రవాహం కొనసాగిస్తుండగానే నందయ్యతల పైకెత్తి గర్భగుడిలోని దేవుణ్ణి చూద్దామని ఒక అడుగు ముందుకు వేసాడు. వెంటనే బాణాకర్ర వ్యక్తి కర్రతో నందయ్య నెత్తిమీద కొట్టేడు. "అబ్బా" అని నందయ్య తలపట్టుకొని వెనుకకు తిరిగేడు.

నందయ్య వెనకకు తిరిగిన తరువాత ఇంకో నలుగురు ద్వారానికి అడ్డంగా నిలబడ్డారు. పూజారి పొట్ట నవరించుకొంటూ "కుక్కకు సందిస్తే మూతి నాకినట్లు, ఏదో గుడిసెలేస్తే ఇంకదేవుని చూసెతందుకు వచ్చినార్రా, పాపమని బతకనిస్తే మీకు దేవుడు కావాల్రా, ఎవరైనా జూస్తే నానోట్లో మన్ను పడతది, మీ ఇల్లు బూడిదైతది పొండి, పొండి" అంటూ అరిచాడు. ఆ మాటలు పూర్తిగా వినకుండానే నిట్టూర్పు విడుస్తూ అంతా వెనుతిరిగారు. దెబ్బతగిలిన నెత్తిమీద చేయి ఆనించి నీర్సంగా నడవడం ప్రారంభించేడు నందయ్య. అతనితోపాటూ మిగతావారంతా ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా వడి వడిగా అడుగులు వేయసాగేరు. వానచినుకుల క్రమేపీ పెద్దవై గాలివాన దశకు చేరుకున్నాయి. వున్నట్టుండి ఆకాశం ఉరిమింది. క్షణంలో వాతావరణంలో మార్పు అంతా పరుగులాంటి నడక ప్రారంభించేరు. ఈదురుగాలి ఎక్కువయింది. చూస్తుండగానే రోడ్డు పక్కనే వున్న చింతచెట్టు ఫెళ ఫెళమంటూ విరిగిపడి నేలకూలింది దగ్గరలో కనిపించే రైల్వేస్టేషన్‌లో తలదాచుకోవచ్చని అంతా పరిగెత్తేరు. ప్లాట్‌ఫారమ్మీద తలోచోటా చతికిలబడ్డారు. నందయ్యలో నీర్సం ఆవరించింది. నెత్తిమీద తగిలిన గాయం మంట పెడుతోంది.

కళ్ళు మూతలు పడుతుండగా నిద్రకు ఉపక్రమించేడూ బయటవర్షం తగ్గేట్లులేదని.

కుక్క పిల్లని తరుముతోంది, చూస్తుండగానే నాలుగు వైపుల నించీ పిల్లి పిల్లలు చేరాయి. ఆ పిల్లుల గుంపును చూసి కుక్కతోక ముడిచేసరికి పిల్లులన్నీ దాన్ని చుట్టుముట్టాయి.... నందయ్య దిగ్గున లేచాడు. 'ఏమిటీ కల!?' అనుకుంటూ కళ్ళు నులుముకొని చూసాడు. ప్లాట్‌ఫామ్మీది తన మనుషులంతా కునికిపాట్లు పడుతున్నారు. తువాలు నెత్తికి చుట్టుకొని బైటకొచ్చి చూసాడు. వాతావరణం ప్రశాంతంగా వుంది. తుఫాను వెలిసింది. మబ్బుల్లోని సూర్యుడు బైటకొచ్చాడు. "అరేలెగుర్రి, జల్ధీ లెగుర్రి" అంటూ అరిచాడు. అతని మాటలకు అంతా లేచి గబ గబారైలు కట్టవెంబడి నడవడం ప్రారంభించేరు.

నందయ్య మనసులో ఎన్నో చిక్కుప్రశ్నలు. తనకొచ్చిన పగటికలలోని అంతర్యం ఏమిటా అనే ఆలోచనతోనే నడుస్తున్నాడు.

"నాకు తొల్తె సమజయ్యింది. ఆళ్లు మనలగుల్లోనికితోల్రని, ఛీదూత్.. అంటూ ఛీత్కారంగా ఉమ్మేసాడు. ఆ మాటలు విని లచ్చయ్య' 'అరే, కూలిపైసలు పాయె, బగ్గ పైసలయినయ్ రాములోరికి ముడుపుకట్టె తందుకు" అంటూ నిట్టూర్పు విడిచాడు మిగతా వారంతా మౌనంగా నడుస్తున్నారు. వాతావరణం పొడిగా వుంది. మధ్యాహ్నపు ఎండ పల్చగా వున్నా చురుక్కుమనిపిస్తోంది. మళ్ళీ వస్తాను సుమా అనే హెచ్చరికతో వాన చినుకులు విరామం ఇస్తూ పడుతున్నాయి. అంతా రైలు కట్టదాటి మామిడిపల్లి వైపు తిరిగేరు. చేలగట్ల బురదలో కాళ్ళు జారుతున్నాయి. గూడెంకు చేర్చే అడ్డురోడ్డుకు సమీపంగా వచ్చి అటు తిరగబోయేటంతలో "ఒకే అగురొరె, మీతో పనిబడినాది, అయ్యగారు కబురంపిర్రు" ఆయాసపడుతూ వచ్చి చెప్పేడు బాణాకర్రతో వారిని ఆపిన వ్యక్తి అతని వంక ప్రశ్నార్థకంగా చూసి, "మాతో ఏం పని?" అన్నాడు నందయ్య కోపంగా. నాకు దెల్వదు. వున్నపట్నేమిమమ్మల్ని తొటకు రమ్మన్నరు అయ్యవారు, పోదాంప అన్నాడు బాణాకర్ర "ఏందిరా లచ్చిగా ఏం జేద్దాము?" అన్నాడు నందయ్య. లచ్చయ్య కొద్దిక్షణాల సేపు ఆలోచించి, "ఇద్దరం బోయి సంగతి

తెల్సుకుందాం" అన్నాడు మిగతా వారిని అక్కడే వుండమని ఇద్దరూ బయలుదేరేరు. గుడి దగ్గరయ్యేకొద్దీ వారిలో ఉత్సాహం ఎక్కువయింది. గుడినించి పాటలు వినబడడంలేదు. బాణాకర్ర భయం భయంగా చూస్తూ వీరి వెనకే వస్తున్నాడు.

తలొంచుకొంటూ వస్తున్న నందయ్య, లచ్చయ్యలకు గుడి సమీపించేసరికి ఆశ్చర్యం కలిగింది. తాము చూసేది కలో, నిజమో అర్థం కాలేదు. గుడి ఒక మూలకు ఒరిగిపోయింది. ఎడమభాగపు గోడ కూలిపోయి వుంది. వారు ఆశ్చర్యం నించి తేరుకునేటంతలో పూజారి గబగబా వచ్చి. "అరే అరే దేవుని గుడి కూలిపోయింది, తుఫానుకి, గాలివానకి గోడలు పడిపోయినయిరా, మళ్లీ కట్టాల గోడ పనికి ఒస్తార్రా, దేవుణ్ణి వెంటనే నిలబెట్టకపోతే మన ఊరికి గత్తర ఒస్తాదట, మన పొలాలు పండపంట, చెరువు కట్ట తెగిపోతాదట, మీరు వెంటనే కూలిపనికి రాండి, మీ వాండ్లను తోలుకుని జల్దీ పని చెయ్యాలిరా" అన్నాడు.

నందయ్య ముఖం ఆ మాటలతో మ్లానమయింది. రెండు చేతులు బిగుసుకున్నాయి. లచ్చయ్య భుజం మీద చెయ్యి వేసి, "అపుడు గుళ్ళోకొచ్చినపుడు ముట్టుడుంది గానీ గుడి కట్టెతందకు లేదాసామి ముట్టుడు? ఈ గుడి కట్టెతందుకు మేమెదొరికానామా? అవును సామీ, పుట్టిన కాణ్ణించేలి, సచ్చేదాకా మేమే మీ గతి, నువ్వు పుట్టినపుడు నీ ఇల్లు కడిగింది మేమే, నీ ఇండ్ల బావి తవ్వింది మేమె, నువ్వు పాలు తాగనీకి పెంచే గొడ్లను సాదేది మేమో, ఇన్నిటి కాడ లేని ముట్టుడు మట్టిబొమ్మకాడ ఒచ్చినాదాసామీ, ఆ బొమ్మవున్న గుడికూలిపోతే కూలిపని చెయ్యనీకి మేమే దొరికినామా సామీ, ఛీ ధుత్"... అంటూ చీత్కారంగా ఉమ్మేసి నిలబడ్డాడు నందయ్య.

ఆ మాటలు విని ఏమనాలో తెలీక నిశ్చేష్టుడై నిలుచుండిపోయాడు పూజారి. లచ్చయ్య తన చెయ్యి నందయ్య బుజం మీద వేసి, పుజారి వంక తిరిగి "ఏం దొరా గత్తర ఒస్తాదా, రానీండి, మాకు పనికి రాని దేవుడోడు మాకెందుకు? మావోడు తన్నులు బడ్డపుడు ఏదేవుడు అడ్డం వచ్చిండు? ఆడి మనుషులు మావోడి రక్తం

జూసినపుడు ఏ దేవుడు రచ్చించ్చిండు? ఆడి గుడి పడిపోతుంటే చూసెటోడు, మడుసుల రక్తాలు చూసెటోడు, ఆ దేవుడికోసం మేమెందుకు తిప్పలు బడేది? మీదేవున్ని మీకాడనే వుండనీండి సామీ. మా రెక్కలే మాకు దేవుడు, మా కట్టమే మాకు దేవుడు" అని నందయ్యను తీసుకొని అక్కడనుంచి నిష్క్రమించాడు. వెళు తున్న వారిద్దరినీ చూసి పూజారి, బాణాకర్ర, కూలిపోయిన ఆ గుడి విస్తుబోతూ, స్థబ్ధుగా వెళ్ళిన దిక్కే చూస్తుండగా వారు అదృశ్యమయ్యేరు.

*–మయూరి వీక్లీ, 5 ఫిబ్రవరి 93*

*1993 మయూరి దసరా కథలపోటీలో మూడవ బహుమతి పొందినకథ*

* * * * *